# ఉపదేశం

వేమూరి వేంకటేశ్వరరావు

నేను యూనివర్సిటీ పక్షిని కనుక యూనివర్సిటీ ప్రొఫెసర్లు చెప్పే కబుర్లు గభీమని నమ్మను. లోగుట్టు నాకు తెలుసు. యూనివర్సిటీ ప్రొఫెసరు అన్న డాలు అడ్డంగా పెట్టుకుని వీళ్ళు ఏవేవో రాతలు రాస్తారు, కూతలు కూస్తారు, కోతలు కోస్తారు. ఈ రాతలూ, కూతలూ కూడ కోతలే అని నలుగురూ అనుకునే ప్రమాదం లేకపోలేదు. ఈ మధ్య యూనివర్సిటీ అఫ్ వాషింగ్టన్ లోని మానసిక శాస్త్ర విభాగంలో పనిచేసే ఒక ప్రొఫెసరు ఒక రాత రాసేడు. ఇది కూతో, కోతో, కోతి చేష్టో మీరే నిశ్చయించండి.

ఈయన ఉన్నవాడు ఉన్నట్టు ఊరుకోకుండా భార్యాభర్తల మధ్య చీటికి మాటికి గిల్లికజ్జాలూ, మనస్థాపాలూ రాకుండా సంసారమనే బండి సవ్యంగా నడవాలంటే మొగుడు చచ్చినాడు పెళ్ళాం మాట వినేసి పడుండాలని ఒక సలహా పారేసేడు. ఈ మాత్రం విషయం మనకి తెలియదా? దీనికి యూనివర్సిటీ ప్రొఫెసరు మనకి సలహా ఇచ్చేదేమిటని మీరు అనవచ్చు.

అదే ఈ యూనివర్సిటీ ప్రొఫెసర్ల రహస్యం. మనందరికీ తెలుసున్నదే వీళ్ళు ఇంగ్లీషులో – అదీ సులభంగా అర్థం అయే ఇంగ్లీషులో కాకుండా మనెవ్వరికీ అర్థం కాని రీతిలో ఆ వాక్యాలని నిర్మించి – చెబుతారు.

ఉదాహరణకి ఒక చిన్న పిట్టకథ చెప్పి అసలు విషయానికి వస్తాను. నా చిన్నతనంలో మా ఇంటిలో ఆడ జనాభా నలుగురైదుగురు మనుషులకి దాటిందంటే అందరూ ఒకరి తర్వాత ఒకరు – కూడబలుక్కున్నట్టు – బయట ఉండేవారు. ఈ దృగ్విషయం ('ఫినామినన్') మా ఇంట్లో ఆడకీ మగకీ, పిల్లకాయలకీ అందరికీ తెలుసు. నా అనుమానం ఏమిటంటే ఈ విషయం మా ఇంట్లోనే కాదు, దేశం అంతా తెలుసని. కాని అమెరికాలో ఒక ప్రొఫెసరు ఒకావిడ ఇండియా ఏదో పని మీద వచ్చినప్పుడు ఈ విషయం ఈ నోటా ఆ నోటా విన్నాదిట. తిరిగి వచ్చి ఇదేదో తను సొంతంగా కనిపెట్టేసిన విషయంలా దీని మీద డాక్టరేటు పట్టా పుచ్చుకునేందుకు ఒక సిద్ధాంత వ్యాసం రాసేసింది. అమెరికా వాళ్ళు కనుక వీళ్ళు బాస్మతి బియ్యంతో పాటు ఆడంగులు బయటుండే వయినాన్ని కూడ పేటెంటు చేసేసి నాలుగు డబ్బులు గణించే మార్గం చూడ గల సమర్థులు. పెడదారిన పడుతునాను కదూ?

సంసారంలో భర్త కర్తవ్యం గురించి ప్రస్తావిస్తూ కదూ దారి తప్పేను? మగవాడి బతుకులో వర్ణాశ్రమ ధర్మం ప్రకారం బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం అని నాలుగు దశలు ఉన్నాయి కదా? ఈ దశలలో ఉపదంశాల లాంటి ఉపదశలు కూడా ఉన్నాయి. మచ్చుకి గృహస్థంలో ఉన్న నాలుగు ఉపదశలని పరిశీలిద్దాం. ఈ ఉపదశలు ముఖ్యంగా ఈ అమెరికాపల్లి లో జరిగిన పెళ్ళిళ్ళకే వర్తిస్తాయి; అనకాపల్లిలో జరిగిన వివాహాలకి వర్తించక పోవచ్చు, వర్తించనూ వచ్చు.

## ఉపదశ 1: విషాద దశ

ఇది అర్జున విషాద యోగం లాంటిది. పెళ్ళయి ప్రేమయాత్రలకి వెళ్ళి తిరిగి వచ్చి కాపురం పెట్టిన మొదట్లో మొదలవుతుంది ఈ దశ. పెళ్ళి ముందు ఒకరి చేదస్తాలు మరొకరికి ఎంత ఆకర్షణీయంగా కనిపిస్తాయో అవే చేదస్తాలు ఇప్పుడు వెగటు పుట్టిస్తాయి. ఉదాహరణకి చిన్న సంఘటన. అతనికి మేజోళ్ళు మడత పెట్టుకోవడం కూడ చేత కాలేదని, అమాత్రం చేత కాక పోతే ఎలాగ అని ఆమె మొదటిసారిగా వగచింది. వగచి నోరు మూసుకు ఊరుకుంటే బాగానే ఉండేది. మాటవరసకి ఏదో మాట అంది. అతనికి కొంచెం కోపం రాలేదు కానీ ముద్దుల భార్యతో ముచ్చటగా మాట్లాడాలనే తపనతో అతను ఏదో పరాచికం ఆడుతునాననుకుంటూ ఆలోచించకుండా ఏదో సమాధానం చెప్పేడు. ఆమెకి కసుక్కున కోపం వచ్చింది. "ఏదో మాటవరసకి అన్నాను. శబ్ద తప్పులు పట్టేసి దీనికి ఇంత రాద్ధాంతం చెయ్యాలా" అని అతను అంటూ ఉంటే, 'విన్నది చాలు' అన్నట్లు ఆమె చెవులు మూసుకుంది. అతని అహం దెబ్బ తింది. గొంతుక ఎత్తి మరి కొంచెం గట్టిగా మాట్లాడేడు. ఆమె విసురుగా అక్కడనుండి శయ్యాగారానికి తరలి వెళ్ళి తలుపు భళ్ళున వేసేసింది.

మూర్ఖుడైన మగాడయితే ఈ స్థితికి చేరుకోగానే ఒళ్ళు మండి ఏ కత్తితోనో ఆ పెళ్ళాన్ని పొడిచేసి జైలులో రామా కృష్ణా అనుకుంటూ కాలక్షేపం చేసేస్తాడు. మరీ అంత మూర్ఖత్వం లేని మధ్య రకం ఘటం అయితే రాత్రికి రాత్రి హోటల్లో దిగిపోయి, మర్నాడు లాయరు దగ్గరకి వెళ్ళిపోతాడు – విడాకుల కోసం. తెలివైన వాడు అయితే విడాకుల కోసం పరిగెడితే విస్తరాకుల్లో 'వణ్ణం' ఉండదని తెలుసు కాబట్టి సంసార సాగరం ఈదడంలో మొదటి అధ్యాయం సమాప్తం అయిందనిన్నీ, రెండవ అధ్యాయం మొదలైందనిన్నీ గమనించి ఒక కొబ్బరి కాయ కొట్టేసి మళ్ళా చేత్తో అక్షతలు పట్టుకుని (అవసరం వచ్చినప్పుడు భార్యామణి చేతికి ఇచ్చి నెత్తి మీద వేయించుకోడానికి) కార్యక్రమం కొనసాగిస్తాడు.

## ఉపదశ 2: మనోవికాశ దశ

ఇద్దరమూ చిన్నవాళ్ళమే. అందులో తన కంటె ఆమె నాలుగయిదేళ్ళు చిన్నది. చిన్నతనం కొద్దీ ఆమె ఏదో అంటే తను అంతలా పట్టించుకోవాలా అని అతనే సర్దుకుని, "అయితే నువ్వు అనేది ..." అని ఆమె మనోగతాన్ని అవగాహన చేసుకునే ప్రయత్నంలో అడుగుతాడు. వాచ (ఓరల్) పరీక్షల సమయంలో ప్రశ్న అర్థం కాకపోతే విద్యార్థులు ప్రయోగించే జిత్తు అచ్చం ఇలాంటిదే. కాని ఆ పాచిక ఇక్కడ పారేటట్లు లేదు.

"నేననేది, ఆ వెధవ సాక్సు మడత పెట్టి డ్రాయరులో పెట్టమని. ఎన్ని సార్లు చిన్న పిల్లలకి చెప్పినట్లు చెప్పాలి?"

మాంచి రంజులో ఫుట్‌బాల్ ఆట చూస్తూన్న అతని చెవులకి 'వెధవ సాక్సు' అన్న మాట మాత్రం ఖణీగా వినిపించింది. ఒక్క సారి ఈ 'వెధవ సాక్సు' అన్న మాట కర్మధారయ సమాసమా, షష్ఠితత్పురుషా అని అనుమానం వచ్చింది. పెళ్ళి కాక పూర్వం ఇటువంటి సందర్భంలో ఇటువంటి అనుమానం వస్తే అతని 'సెన్స్ అఫ్ హ్యూమర్' కి ఇద్దరూ పగలబడి – అక్కడ సోఫా ఉంటే, ఆ సోఫాలో పడి – దొర్లి ఉండే వారు. కాని చిటపట్లాడుతూన్న ఆమె ముఖం చూడగానే అతనికి శంకరాచార్యులవారి 'నహి నహి రక్షతి' అన్న శ్లోకం గుర్తుకి రాగా వ్యాకరణ సంబంధమైన అనుమానాలని పక్కకి నెట్టి నేరుగా 'మేరేజి కౌన్సెలర్' కచేరీకి ప్రయాణం పెడతాడు.

ఆ 'మేరేజి కౌన్సెలర్' మగవాడైతే అతను ఈ కథ అంతా విని ఒక సారి బుర్రని జాడించి – దాలిగుంట లోంచి లేచిన కుక్క ఒళ్ళు జాడించినట్లు – నిస్పృహతో 'ఈ ఆడవాళ్ళకి ఏమిటి కావాలో బోధపడి చావడం లేదు' అని చెప్పి, ఊరడించి వంద డాలర్ల ఫీజు పుచ్చుకుని పంపించెస్తాడు. ఆ 'మేరేజి కౌన్సెలర్' ఆడదైతే ఆమె కూడ ఈ కథ అంతా సావధానంగా విని ఒక సారి జాలులా ముఖం మీద పడుతూన్న జుత్తుని వెనక్కి పోయేటట్లు తలని ఆడించి – ఇది అమెరికాలో 'సెక్సీ జెస్చర్' – 'ఆ దరిద్రగొట్టు సాక్సుని మడత పెట్టేస్తే పోలా, దీని కోసం నా వరకూ రావాలా!' అని చెప్పి మందలించి వంద డాలర్ల ఫీజు పుచ్చుకుని పంపించెస్తుంది. ఇలా వంద డాలర్ల జ్ఞానోదయం అవగానే మనవాడు సంసార సాగరం ఈదడంలో రెండవ అధ్యాయం సమాప్తం అయిందనిన్నీ, మూడవ అధ్యాయం మొదలైందనిన్నీ గమనించి మరొక కొబ్బరి కాయ కొట్టేసి, మళ్ళా చేత్తో అక్షతలు పట్టుకుని జీవితాన్ని కొనసాగిస్తాడు.

## ఉపదశ 3: ఆత్మార్పణం

మగాడు కనుక, పౌరుషం ఉన్న వాడు కనుక, శరీరంలో చీము, నెత్తురు ఉన్న వాడు కనుక, సామాన్య మానవులకి ఉండే దౌర్బల్యాలకి అతీతుడు కాదు కనుక కొన్నాళ్ళు తన పంతం తనదే అంటూ మంకు పట్టు పట్టుకు కూర్చుంటాడు. కాని ఇలా మంకు పట్టు పట్టినన్నాళ్ళూ ఏ పోరాటంలోనూ విజయలక్ష్మి వరించ లేదు. ఓటమి మీద ఓటమి. ఓడిన ప్రతి సారీ తను చేసిన పనులన్నిటినీ పునశ్చరణ చేసుకుంటాడు – ఎక్కడ తప్పు జరిగిందా అని. నెమ్మది నెమ్మదిగా జ్ఞానోదయం అవడం మొదలవుతుంది.

మొదటగా – తన కంటె ఆమెది అసమానమైన జ్ఞాపక శక్తి అని గమనించేడు అతను. ఇది నిజమో కాదో మీరే చెప్పండి. ఒకసారి అతను బుద్ధిగా సాక్సు అన్నీ మడత పెడదామని ఆయత్త పడుతూ ఉండగా అదే సమయంలో టీవీ మీద ఏదో 'స్పెషల్ రిపోర్టు' వస్తోందని వార్త వచ్చింది. 'స్పెషల్ రిపోర్టు' అయిపోయిన తర్వాత సాక్సు మడత పెడదామంటే అప్పటికే 'చిటికెలో మడతపెట్టి దాచేస్తునాను కదా' అని మాటిచ్చేడే. అందుకని ఆమె చూడకుండా 'సాక్సు' లన్నిటినీ లుమ్మ చుట్టి సొరుగులో దోపేసి, 'టీవీ' మీద 'ప్రోగ్రాం' ముందు చూసేసి, తర్వాత సాక్సు మడత పెట్టడానికి డ్రాయరు తెరచి చూసేసరికి ఏముంది? సాక్సు అన్నీ ఒకదానికొకటి అంటుకుపోయి పెద్ద లుమ్మలా బయటికి వచ్చేయి. అతనికి కళ్ళ వెంబడి నీళ్ళు వచ్చేయి. చిలకల్లాంటి సాక్సు, పెయింటు పొట్టని పెట్టుకుంది.

"అదేమిటి. ఆ డ్రాయరుకి లోపల వార్నిష్ వేస్తానని నేను కిందటి వారం నుంచీ చెబుతునాను కదా." చిన్న చిలకలా కూనిరాగం తీసింది ఆవిడ.

"ఎప్పుడు చెప్పేవ్. నాకు జ్ఞాపకం లేనే లేదే!"

"ఆ మాత్రం జ్ఞాపకం లేకపోతే ఎలా చచ్చేది? కిందటి శనివారం సాయంకాలం మీరు పేపరులోని 'స్పోర్ట్సు' పేజీ పట్టుకుని ఆ 'బాస్కెట్‌బాల్' ఆడేవాడెవడో 'అంపైరు'ని కొట్టేడంటూ పెరట్లో గులాబీ మొక్క దగ్గర పడక కుర్చీలో కూర్చుని చెబుతూ ఉంటే నేను చిలకాకు పచ్చ చీర కట్టుకుని, జరీ బోర్డరు ఉన్న జాకెట్టు వేసుకుని పంతులు గారింటికి వెళడానికి బయలు దేరే ముందు చెప్పేను కదా – బట్టల డ్రాయరుకి రంగు వేస్తానని. అంత మరుపైతే ఎలా?"

ఏదీ ఒక్క మగ మహారాజుని చెప్పమనండి – నిన్న కట్టుకున్న బట్టల రంగు!

"మనం పంతులు గారింటికి ఈ వారం కదూ వెళ్ళవలసింది?"

"అయ్యో రాత! కిందటి వారం వాళ్ళింటికి వెళ్ళి భోజనాలు కూడ చేసి వచ్చేం. అక్కడ 'స్టాకు మార్కెట్' విషయాలు మాట్లాడుతూ మీరు అర్ధరాత్రయే వరకు కదల లేదు. అప్పుడే అన్నీ మరచి పోయారా?"

ఇటువంటి మేధాశక్తి ఉన్న ఆ ఆడ మనిషికి తను సరి అయిన ఉజ్జీ కాదని అతను గమనించడానికి అంత తెలివి తక్కువ వాడేమీ కాదు. యూనివర్సిటీలో ప్రొఫెసరు కదా. వచ్చిన చిక్కేమిటంటే అతని బలహీనత ఆమెకు తెలుసు. జ్ఞాపకశక్తి విషయంలో మాత్రం అతను తనతో సమ ఉజ్జీ కాదని ఆమెకి తెలుసు. లేకపోతే ఏమిటి? ........

వెధవ జ్ఞాపకశక్తి లేకపోతే పోయింది. కనీసం పెళ్ళాంతో వాదనకి దిగినప్పుడు ఏకాగ్రత లేని ఏదో మనోదౌర్బల్యం. పిల్లి పుట్టినరోజు వచ్చినా ఏమీ పట్టించుకో లేదని ఒకసారి చిరాకు పడిందామె. "మనుషుల పుట్టిన రోజులే మరచిపోతునాను, పిల్లులవి కూడా ఎక్కడ జ్ఞాపకం పెట్టకోను?" అని ఆయన. "అంతలా ఇంటి విషయాలు పట్టించుకోక పోతే ఎలా?" అని ఆవిడ. 'పట్టించు కోక పోవడం' మీద ఇలా వాగ్యుద్ధాలు జరుగుతూ ఉండగనే నిలకడ లేని అతని మనస్సు కోక మీదకి మళ్ళుతుంది. ఆమె కోక మీదకి కాదు, పక్కింటి పార్వతి కోక మీదకి. ఎలాగో ఇద్దరూ సమాధాన పడే సరికి – ఆమె ధారణ శక్తికి ధన్యవాదాలు – ఆమె మరొక పదిహేను 'పట్టించుకోక పోయిన సంఘటనలు' జ్ఞాపకం చేస్తుంది. ఇవేమీ అతనికి లేశమాత్రం జ్ఞాపకం ఉండవు. అలాగని అతనేమీ జడ్డి వాడు కాదు. క్రీ. శ. 1978లో రెజ్జీ జాక్సన్ ఎన్ని 'హోమ్ రన్స్' కొట్టేడో, అతని 'ఎరన్డ్ రన్ ఏవరేజి' ఎంతో వగయిరా బేస్‌బాల్ 'స్టెటిస్టిక్స్' అనర్గళంగా చెప్పగలడు. కర్ణుడి జాతకంలా అదేమి దురదృష్ట జాతకమో, అవసరం వచ్చినప్పుడు కావలసిన అస్త్రం ఒక్కటి జ్ఞాపకం వచ్చి చావదు. మగ జాతిని ఎవరో శపించి ఉంటారు.

ఇలా జ్ఞానోదయం అవుతూన్న తరుణంలో ఎప్పుడో వాళ్ళ బావ చెప్పిన మాటలు అతని స్మృతిపథంలో తళుక్కున మెరిసేయి.

"చూడు బావ మరిదీ. మగడి కంటె పెళ్ళాం కనీసం నాలుగేళ్ళైనా చిన్నదయి ఉండాలని ఎందుకు నియమం పెట్టేరో మన పెద్దవాళ్ళు తెలుసా?"

తెలియదని ఒప్పేసుకున్నాడు అతగాడు.

"నా కంటె నాలుగేళ్ళు చిన్నదయిన నీ అక్క తోటే నేను సాల లేక పోతునాను. ఒకే వయస్సు పిల్లని చేసుకుని ఉంటే ఏమయిపోయేవాడినో!"

పొగమంచు తెర విడి అంతా తేటతెల్లమయిపోతుంది అతనికి.

ఈ దశకి చేరుకునే సరికి అర్భకులైన మగవాళ్ళయితే ఇంక చెయ్యగలిగినది ఏమిటో తెలియక కన్నూ, బుస్సులాడుతారు. కొందరు పూర్తిగా బ్రహ్మజ్ఞానం పొందిన మహానుభావులు ఉన్నారు. వీరు నిండుకుండలా తొణకని వారు. సంసార సాగరాన్ని ఈదడంలో ఆరి తేరిన వారు. జ్ఞానోదయం అయిన వారు. శివోహం అన్న శబ్దం యొక్క అంతరార్థం అవుపోసన పట్టిన వారు. వాదించి ప్రయోజనం లేదనిన్నీ, ఓటమిని ఒప్పేసుకుని దాసోహం అనేసిన వారు. వీరే ఆఖరి దశ చేరుకుని మోక్షం పొందిన వారు.

## ఉపదశ 4: మోక్ష దశ

ఇదే చరమ దశ. సంసారం సాగరం దుఃఖం అన్నారు. ఎటు చూసినా దుఃఖమే. ఈ దుఃఖ సాగరంలో హీనయానం అనే పడవ వేసుకుని ఇంత వరకూ చేసిన ప్రయాణం అయిపోయింది. అవలి గట్టు చేరుకున్నాడు. వెనక్కి తిరిగి చూస్తే పడవా కనిపించ లేదు. సముద్రమూ కనిపించ లేదు.

జరిగినదంతా ఒక భ్రమ. ఎదురుగుండా కనిపిస్తూన్నది స్వర్గం! ఇప్పుడు మేజోళ్ళని మడత పెట్టడం, వెంటనే సొరుగులో పెట్టడం ఒక పెద్ద పనిలా అనిపించడం మానేసింది. అందులోనూ ఆ పని చేసేస్తే భార్య సంతోషిస్తుందంటే వెంటనే చేసెయ్యడమే. కచేరీకి వెళ్ళిన తర్వాత ఎవరి మాటో ఒకరి మాట వినకుండా రోజు గడవని ఈ రోజుల్లో కనీసం పెళ్ళాం చెప్పిన మాట వినేస్తే ఇంట్లో ఉన్న నాలుగు నిమిషాలూ మనస్సుకి శాంతిగా ఉంటుంది కదా.

ఇలా జ్ఞానోదయం అయిన అతను – అర్జునుడికి గీతోపదేశం చేస్తూన్న కృష్ణపరమాత్మ ఫొటోని బోర్లా పడుక్కోబెట్టి – స్వగతంగా ఏమనుకున్నాడంటే, "నాయనా, తగువు పడకు. తగువు పెట్టకు. లొంగిపో. ఆమె చెప్పినట్లు వినెయ్. 'అలాగే' అని గంగిరెద్దులా బుర్ర అడించి ఏమిటి చెయ్యమంటే అది చేసెయ్. నీ ప్రయోజకత్వం ఆఫీసులో చూపించు. పెళ్ళానికి లొంగిపోయేవేమిటిరా అని తల్లి కాని, అప్పచెల్లెళ్ళు కాని అంటారు. కాని వాళ్ళ మాట వినకు. నీ ఏకాగ్రతకు భంగం రానియ్యకు. పెళ్ళాం చెప్పిన మాట వినెయ్."

ఈ ఉపదేశం మీద మీకు ఇంకా నమ్మకం లేకపోతే అతని సహధర్మచారిణి, జీవిత భాగస్వామిని అయిన అతని భార్యని పిలిచి మీరే అడగండి.

## జ్ఞాన దీపావళి

నా హృదయ కుహరాన
మెహెరుడే ఉండగా
దినదినము నాకింక పండగ...
క్షణక్షణము జ్ఞాన
దీపావళీ పండగ....
అంతటా వెలుగు నిండెగా
అంధకారమె లేకుండెగా
మహా విశ్వమే అణువౌచుండెగా
అనంతకాలమే క్షణికమౌచుండెగా
భ్రాంతియే లేకుండెగా
శాంతియే యుండె నిండుగా
రాలు మారెను పూల చెండుగా
మండుటెండలో వెన్నెల పండెగా
రాతిబండౌ పూలదిండుగా
గరళమే మారు కల్కండగా
ఇహయాత్రకై చింతదండగా
ఉండులే బ్రతుకింక గ్రాండ్ గా
దేవళమ్ముల వెదక దండగ
మతములౌ మెహెరు పూదండగ
అర్పింతు నా ప్రేమ పుష్పమీనాడు
అర ఘడియలో వాడు పూలేలనేడు?

*– మంత్రవాది శ్రీ రామమూర్తి,*
**Edison, NJ.**

## దీపావళి

గోపాలునికి ప్రక్కన నిలిపి
ధైర్యంగా నరకుని జంపె
వయ్యారాల భామ ఆ సత్యభామ.
దీపాలను బారులుగ పేర్చి
మతబేధాలను ఆదమర్చి
జాతికి బాటలు వేస్తూ
దీపావళి పండుగ చేస్తున్న
సిరులుచిందు లక్ష్మిని కొలుస్తున్న.
చిరుబరులంటూ ఆఫీసరు
సీమటపాసులను మరిపించె.
కొత్తబట్టలు తేలేదని
కుటుంబ సభ్యుల కోపం
లక్ష్మి బాంబులను మరిపించె.
చిరునవ్వులు చిందించు
చిన్నారి తుస్సుబుస్సుమనే
వస్తుందన్న బోనసు రాక
క్లర్కు వేసేను కప్పగంతులు
చిత్రవిచిత్రాల వెలుగులు
కూర్చే నేటి దీపావళి శోభలు

దూపాటి శేషుకుమారాచార్యులు
Sarapaka, AP


తెలుగు వారికి ప్రత్యేకంగా
తెలుగులోనే సంప్రదింపులు

**TASNEEM, M.D.,**

**PEDIATRICS**

Infants, Children and Adolescents

**Office Hours By Appointment**

**136-30 Sanford Avenue, Suite B**
**Flushing, NY 11355**

**(718) 358-3100**



The Advantages of Professional Money Management

***Investment Consulting Services***

Now, individual and small retirement plan investors with assets of $100,000 or more can take advantage of Dean Witter's **Investment Consulting Services**. Our programs offer you professional money management with the same benefits afforded to institutional investors.

Whether you are an individual investor or the administrator of a trust or employee benefit plan, contact us to find out more.

*ViJAY GAVINI*
*Account Executive, Investments*
*(800) 347-5018* *DEAN WITTER*

© 1997 Dean Witter Reynolds Inc. Member SIPC